సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



అలరించిన చోర సంవాదం

అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన చోర సంవాద ఘట్టం భక్తులను అలరించింది.


8లో



రూ.2,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి హరికృష్ణ, దీప్తి సుశ్రిత్ కృష్ణ (విజయవాడ) రూ.లక్ష, వేంకటరావు, దీప (చెన్నై) రూ.1,00,116 చొప్పున మంగళవారం విరాళాలు సమర్పించారు.

8,850 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.85 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

చాయ్‌లో కల్తీ ఛాయలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో కల్తీ టీ పొడి విక్రయాలు అధికంగా సాగుతున్నాయనే సమాచారంతో విజిలెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా టీ పొడి హోల్‌సేల్ షాపులు, ప్యాకింగ్ యూనిట్లలో తనిఖీలు చేపట్టారు. సోమ, మంగళవారాల్లో రాజమహేంద్రవరం వెంకటేశ్వర జనరల్ మార్కెట్‌లోని వర్ష టీ పొడి దుకాణంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అమ్మకానికి సిద్ధం చేస్తున్న 767 కేజీల టీ పొడి నాణ్యతను ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా పరిశీలించారు. దానిలో 314 కేజీల కల్తీ టీ పొడిని గుర్తించి సీజ్ చేశారు. సాధారణమైన దాని కన్నా ఈ టీ పొడి అధిక గాఢత కలిగి ఉండటంతో కల్తీ జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. గతంలో బిక్కవోలు తదితర ప్రాంతాల్లో టీ పొడిలో చింతపండు పిక్కల పొడి, మరి కొన్నిచోట్ల రంపం పొట్టు కూడా కలిపిన ఉదంతాలున్నాయి. ఈ కల్తీ టీ పొడిని రాష్ట్రంలోని మారుమూల గ్రామాలతో పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ ప్రాంతాలకు భారీ మొత్తంలో రవాణా చేసేవారు. ప్రస్తుతం పట్టుబడిన కల్తీ టీ పొడిని ఏ ప్రాంతాలకు సరఫరా చేశారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. వర్ష టీ పొడి దుకాణంలోని టీ పొడి నమూనాలు సేకరించారు. వాటిని ఫుడ్ సేఫ్టీ అధికారుల ద్వారా పరీక్షా కేంద్రానికి పంపి, కల్తీ ఎంతమేర జరిగిందనేది గుర్తించి, చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ మధుబాబు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆహార తనిఖీ అధికారులు రుక్కయ్య, తూనికలు – కొలతల శాఖ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

14న రేషన్ బియ్యం వేలం



జేసీ చిన్నరాముడు

దేవరపల్లి: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యానికి ఈ నెల 14న గోపాలపురం, దేవరపల్లిల్లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కిలో బియ్యం ధర రూ.22గా నిర్ణయించామన్నారు. గోపాలపురంలో 47.274 మెట్రిక్ టన్నులు, దేవరపల్లిలో 16 మెట్రిక్ టన్నుల బియ్యానికి వేలం వేస్తామని తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద, మధ్యాహ్నం ఒంటి గంటకు దేవరపల్లిలోని శ్రీ వేంకటేశ్వర రైస్ మిల్లు వద్ద వేలం నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు జీఎస్టీ లైసెన్స్ కలిగి, ముందుగా రూ.5 వేల ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. వేలం పాట వాయిదా, నిలుపుదలకు జిల్లా యంత్రాగానికి అధికారాలున్నాయని తెలిపారు.

డయాఫ్రమ్ వాల్ కొట్టుకు పోవడానికి బాబే కారణం



హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో మొదటి డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోవడానికి నూరు శాతం చంద్రబాబే కారణమని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ధ్వజమెత్తారు. డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని ఇసుక నేలలో కాకుండా హార్డ్ రాక్ వద్ద చేపట్టాలని తెలిసినప్పటికీ చంద్రబాబు అనాలోచిత నిర్ణయాలతో దానిని పాటించలేదని ఆరోపించారు. లక్షలాది మంది ప్రాణాలకు సంబంధించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానమైన డయాఫ్రమ్ వాల్‌ను చంద్రబాబు ఎక్కడ, ఎలా నిర్మించారనే విషయంపై కేంద్ర జలసంఘం ప్రత్యేకంగా దృష్టి సారించి, వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం నిర్మాణంపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. తన పోరాటాన్ని పరిగణనలోకి తీసుకొని సీడబ్ల్యూసీ మంచి నిర్ణయం తీసుకుందని అన్నారు. విలోమ ఫిల్టర్ ద్వారా సీపేజ్ అరికట్టడం అసంభవమన్నారు. కొత్త డయాఫ్రమ్ వాల్‌ను హార్డ్ రాక్ వరకూ నిర్మించడం మంచి పరిణామమని అన్నారు.

అన్నవరం దేవస్థానంలో వాట్సాప్ సేవలు

అన్నవరం: వాట్సాప్ ద్వారా సత్యదేవుని సన్నిధిలో వివిధ సేవల టిక్కెట్ల విక్రయాలు, విరాళాల స్వీకరణ తదితర సేవలకు వీలు కల్పించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు మంగళవారం ఈ విషయం తెలిపారు. వాట్సాప్ నంబర్ 95523 00009కు హాయ్ అని ఇంగ్లిషులో మెసేజ్ పెడితే వివిధ సేవలు ఓపెన్ అవుతాయి. వాటిలో టెంపుల్ బుకింగ్ సర్వీసెస్‌ను ఎంచుకోవాలి. అందులో వివిద దేవస్థానాలు ఓపెన్ అవుతాయి. వాటిలో అన్నవరం దేవస్థానం ఎంచుకుని, కావాల్సిన సేవకు డిజిటల్ పేమెంట్ చేసి, రశీదు పొందాలి. దానిని ప్రింట్ తీసుకుని దేవస్థానం ఆయా విభాగాల్లో చూపిస్తే ఆయా సేవలకు, వ్రతానికి అనుమతిస్తారని ఈఓ సుబ్బారావు తెలిపారు.

బీడువరితున్న రబీ

- గోదావరి డెల్టా ఆయకట్టులో నీటికి కటకట
- రెండు జిల్లాల్లో 4.50 లక్షల ఎకరాల్లో రబీ సాగు
- డెల్టా కాలువలకు 8,850 క్యూసెక్కుల పంపిణీ
- శివారు... మెరకలకు అందని నీరు
- సాగునీటి యాజమాన్యం అస్తవ్యస్తం



కాకినాడ జిల్లా కరపలో ఎండిపోతున్న వరిచేలు



కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు -2 లాకు వద్ద ఎండిపోయిన ప్రధాన పంట కాలువ

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టాలో రబీకి కష్ట కాలం మొదలైంది. డెల్టా శివారు.. మెరక ప్రాంతాల్లో నీటి ఎద్దడి నెలకొంది. నీరందక పంట చేలు నెర్రెలు తీస్తున్నాయి. డెల్టా కాలువలకు అవసరానికి సరిపడా నీరు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నా, అధ్వానంగా ఉన్న పంట కాలువల వ్యవస్థ... అస్తవ్యస్తంగా మారిన నీటి యాజమాన్యం వల్ల చేలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

ఖరీఫ్ సాగులో దెబ్బతిన్న రైతులు కోటి ఆశలతో రబీకి శ్రీకారం చుట్టారు. నీటి ఢోకా లేదని చెబుతూ వచ్చిన సాగు నీటిపారుదల శాఖ అధికారులు కీలక సమయంలో చేతులు ఎత్తేశారు. నాట్లు వేసిన చోట్ల వరిచేలు దుబ్బులు చేస్తున్నాయి. మరోవైపు వేసవి ఎండలు పెరగడంతో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటుతున్నాయి. ఈ సమయంలో చేలకు సమృద్ధిగా నీరందించాల్సి ఉంది. కాని రైతులు అరకొర నీటితో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. తూర్పు డెల్టా పరిధిలో కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల్లో శివారుల్లో నీటి ఎద్దడి తప్పడం లేదు. పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) పరిధిలో పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట మండలాల్లో అరకొర సాగునీటితో రైతులు నెట్టుకొస్తున్నారు. మధ్యడెల్టాలో ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, అల్లవరం, కాట్రేనికోన, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి వంటి శివారు మండలాల్లో ఎద్దడి అధికంగా ఉంది. ఇక్కడ ప్రధాన పంట కాలువలకు అనుబంధంగా ఉన్న చానల్స్, పంట బోదెల్లోనే సాగునీరు ఉండడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తూర్పు డెల్టాకు 2,650 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున మొత్తం మొత్తం 8,850 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు, సహజ జలాలు, ఇప్పుడు విడుదల చేస్తున్న నీటితో పెద్దగా ఎద్దడి రాకూడదు. పైగా లాకుల వారీగా వారాబందీ (వంతుల వారీ విధానం) అమలు చేస్తున్నారు. ఈ కారణంగా ఎద్దడి ఎదుర్కోనాల్సిన అవసరం లేదు. కానీ చేలు ఎండిపోయేలా పరిస్థితి ఉన్నా నీరందడం లేదు.

అధ్వానంగా పంట కాలువలు... అస్తవ్యస్తంగా నీటి యాజమాన్యం

డెల్టా పంట కాలువ వ్యవస్థ ఆధ్వానంగా మారింది. రబీకి ముందు చేయాల్సిన షార్ట్ టర్మ్ క్లోజర్ పనులు చేయలేదు. కనీసం పంట కాలువల్లో పూడిక, గుర్రపుడెక్క తొలగించలేదు. ప్రధాన పంట కాలువలతోపాటు చానల్స్, పంట బోదెల్లో గుర్రపుడెక్క అల్లుకుపోయింది. లాకుల వద్ద, డైరెక్ట్ పైపులు (డీపీ) వద్ద ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు నిండిపోయాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన అరకొర నిధులతో కూడా పనులు చేయలేదు. దీనివల్ల కాలువలకు నీరందిస్తున్నా శివారుకు చేరడం లేదు. వంతుల వారీ విధానం అమలు చేస్తున్నా ఆయకట్టు రైతులకు ముందస్తు సమాచారం అందించడం లేదు. ఇది కూడా నీరందకపోవడానికి ఒక కారణమవుతోంది. మరీ ముఖ్యంగా మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్‌లు వేయాలని రైతులు, నీటి సంఘాలు కోరుతున్నా ప్రభుత్వంలో చలనం లేకుండా పోయింది. చేల నుంచి మురుగునీటి కాలువల్లోకి నీరు దిగడం కూడా చేలు ఎండిపోవడానికి కారణమవుతోంది.

రైతుల నిరసన



అల్లవరం మండలం దేవగుప్తంలో నీరు లేక నెర్రెలు తీసిన వరిచేలు

అల్లవరం మండలం గుండెపూడి ప్రధాన పంట కాలువపై నీటి ఎద్దడి అధికంగా ఉంది. వంతుల వారీ విధానం పేరుతో మూడు వారాలుగా కాలువకు నీరు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. సుమారు 300 ఎకరాలకు నీరందక పంట చేలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో గత్యంతరం లేక రైతులు ఎండిన చేలల్లో వరి దుబ్బులు పట్టుకుని మంగళవారం నిరసనకు దిగారు.

36 గంటలే వంతు ఇచ్చారు



మూడు వారాల నుంచి నీరందడం లేదు. అంతర్వేది ఉత్సవాల అనంతరం మా కాలువలకు పూర్తి స్థాయిలో నీరు ఇస్తారని ఆశించాం. వంతుల విధానంలో కేవలం 36 గంటలు మాత్రమే నీరందించారు. దీంతో చుక్క నీరు కూడా చేలల్లో పారలేదు. 1.5 ఎకరాలు సొంత భూమి, 7 ఎకరాల్లో కౌలు వ్యవసాయం చేస్తున్నాను. మొత్తం వ్యవసాయమంతా నీటి ఎద్దడి ఉంది. కాలువపై లస్కర్ ఎవరో కూడా తెలియడం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు.

– బొంతు నాగేశ్వరరావు, దేవగుప్తం, అల్లవరం మండలం

పలుచోట్ల ఎండుతున్న చేలు

కాట్రేనికోన మండలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. బొబ్బర్లంక – పల్లంకుర్రు ప్రధాన పంట కాలువ శివారులోనే నీరు లేక ఎండిపోతోంది. కాలువ పరిస్థితి ఇలా ఉంటే పంట చేల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాట్రేనికోన, నడవపల్లి, గెద్దనపల్లి, వేట్లపాలెం, సత్తెమ్మచెట్టు, దొంతికుర్రు, సత్తెమ్మచెట్టు, కొప్పిగుంట, పల్లంకుర్రు వంటి ప్రాంతాల్లో సాగునీటి సరఫరా పూర్తిస్థాయిలో లేదు. పలుచోట్ల చేలు ఎండిపోతున్నాయి. పరిస్థితి దారుణంగా మారడంతో సాగునీటి సంఘాల ప్రతినిధులు ఇప్పుడు జేసీబీ తెచ్చి కాలువల్లో పూడిక తొలగిస్తున్నట్టు హడావుడి చేస్తున్నారు.



కాట్రేనికోన మండలం పల్లంకుర్రు 2 లాకు పరిధిలో ఎండిపోతున్న వరిచేలు



కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరంలో ఎండిపోతున్న వరిచేలు

మొత్తం పంట దెబ్బతినే ప్రమాదం

ఇది ఐ.పోలవరం మండలం జి.వేమవరం శివారు ప్రాంతం. వరి చేలకు నీరందక ఇలా బీటలు వారిపోతోంది. వెదజల్లు పద్ధతిలో సాగు చేసిన చేలకు సకాలంలో నీరందక మొత్తం పంట దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. జి.వేమవరంతోపాటు గుత్తెనదీవిలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఐ.పోలవరం ప్రధాన పంట కాలువ, ఎదుర్లంక కాలువ ద్వారా నీరందాల్సి ఉంది. కాలువలు అధ్వానంగా ఉండడంతోపాటు వంతుల వారీ విధానం అమలు లోపభూయిష్టంగా ఉండడంతో చేలకు నీరందడం లేదు.

తొలి నుంచీ ఇదే పరిస్థితి



రబీ మొదలు పెట్టినప్పటి నుంచి మా ఆయకట్టుకు నీరందించడం లేదు. మా పది ఎకరాలతోపాటు చుట్టుపక్కల ఆయకట్టు అంతా ఎండిపోయేలా ఉంది. అధికారులకు చెబుతున్నా ఫలితం లేదు. పంట కాలువ మొత్తం తూడు, గుర్రపుడెక్కతో ఉంది. మా చేలకు సరిపడా నీరు రావడం లేదు.

– నల్లా మోహనరావు, జి.వేమవరం, ఐ.పోలవరం మండలం

బర్డ్‌ఫ్లూను అరికడతాం

- అపోహలు నమ్మవద్దు
- 64 వైద్య బృందాల ఏర్పాటు
- 34 గ్రామాల్లో వైద్య శిబిరాలు
- కోళ్ల ఫామ్‌లు, చికెన్ షాపుల్లో పని చేసేవారికి స్వాబ్ పరీక్షలు
- 10 కిలోమీటర్ల పరిధిలో చికెన్, గుడ్ల అమ్మకాలపై నిషేధం
- కలెక్టర్ ప్రశాంతి



కోళ్లను చంపేందుకు వెళ్తున్న ప్రత్యేక టీము



కానూరు అగ్రహారంలో అధికారులు, విలేకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పెరవలి: కోళ్లను కబళిస్తున్న బర్డ్‌ఫ్లూ వ్యాధిని పూర్తిగా అరికట్టటానికి అన్ని చర్యలూ తీసుకున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పెరవలి మండలం కానూరు అగ్రహారంలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వ్యాధి నిర్ధారణకు జిల్లాలోని 34 గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ గ్రామాల్లో మొత్తం 64 వైద్య బృందాలను నియమించామన్నారు. తొలి రోజు నిర్వహించిన సర్వేలో ఎవ్వరిలోనూ ఎటువంటి లక్షణాలూ బయట పడలేదన్నారు. వైద్య బృందాలు 10 రోజుల పాటు నిత్యం పర్యవేక్షిస్తాయన్నారు. వ్యాధిని గుర్తించిన ప్రాంతం నుంచి కిలోమీటర్ పరిధిలో రెడ్, 10 కిలోమీటర్ల పరిధిలో సర్వైలెన్స్ జోన్లుగా ప్రటించామని చెప్పారు. ఈ ప్రాంతాల్లోని చికెన్ షాపుల్లో పని చేసేవారిని, కోళ్ల ఫామ్‌లలో పని చేసే వారిని గుర్తించి, స్వాబ్ టెస్టులు చేయిస్తున్నామని తెలిపారు. వ్యాధిని గుర్తించిన చోటు నుంచి కిలోమీటర్ పరిధిలోని ఫామ్‌లలో మిగిలి ఉన్న గుడ్లు, కోళ్లు బయటకు వెళ్లకుండా 25 మందితో కూడిన ప్రత్యేక ర్యాపిడ్ రెస్పాన్స్ టీములు (ఆర్ఆర్‌టీ) ప్రత్యేక చర్యలు చేపట్టాయన్నారు. పది కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో చికెన్, గుడ్లు అమ్మకుండా నిషేధం విధించామని, రెస్టారెంట్లు, హోటళ్లపై కూడా నిత్య పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ, వైద్య, ఆరోగ్యం, పశు సంవర్ధక, పోలీసు, అటవీ శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టామని కలెక్టర్ ప్రశాంతి చెప్పారు. కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి టి.శ్రీనివాసరావు, డీడీ సత్యనారాయణ, డీపీవో వి.శాంతామణి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ డి.అచ్యుత కుమారి, పశు వైద్యాధికారులు సల్మా, చరణ్, ఎంపీడీవో సీహెచ్ వెంకట రమణ పాల్గొన్నారు.

కానూరు అగ్రహారంలో..

- బర్డ్‌ఫ్లూ వెలుగు చూసిన కానూరు అగ్రహారంలో మూడు కోళ్ల ఫామ్‌లు ఉన్నాయి. వీటిలో 64 వేల కోళ్ల సామర్థ్యంతో ఒకటి, 14 వేల కోళ్ల సామర్థ్యంతో రెండు ఉన్నాయి. వీటిలో బర్డ్‌ఫ్లూ సోకి 89,024 కోళ్లు మృతి చెందాయి. మిగిలిన 2,876 కోళ్లను ఆర్ఆర్‌టీ సిబ్బంది చంపేశారు. 350 గుడ్లను నాశనం చేశారు. వీరందరూ ఒకచోట ఉండేలా చర్యలు తీసుకున్నారు. కోళ్లను నేరుగా తాకడంతో వీరి నుంచి ఇతరులకు బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండే ఉండేందుకు ఒక రాత్రి ఇక్కడే ఉండేలా చర్యలు తీసుకున్నారు.
- గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. స్థానికులు బయటకు వెళ్లకుండా, గ్రామంలోకి ఇతరులు రాకుండా చర్యలు చేపట్టారు. మాంసాహార దుకాణాలను మూయించి వేశారు. గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ జల్లించారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గ్రామ పొలిమేరలో పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ నుంచి దాదాపు అన్ని శాఖల అధికారులు సాయంత్రం వరకూ గ్రామంలోనే ఉన్నారు. కోళ్లను పూర్తిగా చంపి, పాతిపెట్టిన తరువాత కానీ వారు వెళ్లలేదు.
- పెరవలి మండలంలో 14, ఉండ్రాజవరంలో 10, నిడదవోలు మండలంలో 12 గ్రామాలు కానూరు అగ్రహారం నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. గ్రామ స్థాయిని బట్టి 2 నుంచి 6 టీములు ఏర్పాటు చేసి, జ్వరం, దగ్గు, తుమ్ములు వంటి లక్షణాలుంటే వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలుంటే వెంటనే యాంటీ వైరల్ మందులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ గ్రామాల్లో కూడా హోటళ్లు, రెస్టారెంట్లు, మాంసం దుకాణాలు తెరవకుండా చర్యలు తీసుకున్నారు.

ఎల్ఐసీలో క్లాస్–3, 4 ఉద్యోగాలు భర్తీ చేయాలి



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న క్లాస్–3, 4 ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసీఈయూ) రాజమహేంద్రవరం డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ డిమాండ్ చేశారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) పిలుపు మేరకు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఈ మేరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ, ఎల్ఐసీ ఏటా మంచి ప్రగతి సాధిస్తోందని, సంస్థలో 2017లో 57,441 మంది క్లాస్–3, 4 ఉద్యోగులుండగా ప్రస్తుతం 42,632 మంది మాత్రమే ఉన్నారని అన్నారు. దీనివలన ప్రస్తుత ఉద్యోగులపై పనిభారం పెరిగిపోయిందన్నారు.

2020లో క్లాస్–3, 4 ఉద్యోగుల నియామకానికి ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఖాళీగా ఉన్న 2,700 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఎల్ఐసీలో క్లాస్–3, 4 ఉద్యోగుల్లో 80 శాతం పైగా సభ్యత్వంతో ప్రథమ స్థానంలో ఉన్న ఏఐఐఈఏకి వెంటనే గుర్తింపు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ అధ్యక్షుడు మాథ్యూస్, మహిళా కన్వీనర్ శిరీష, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ సోకకుండా జాగ్రత్తలు తీసుకోండి

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు



కానూరులో వైద్యాధికారులకు సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు

పెరవలి: జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ప్రజలు ఆందోళనపడనవసరం లేదని, తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. వైద్య సిబ్బందితో కలసి కానూరు అగ్రహారంలో మంగళవారం ఇంటింటి సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జ్వరం, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పుల వంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఆయన సూచించిన జాగ్రత్తలివీ..

- పూర్తిగా వండిన తరువాత మాత్రమే చికెన్ తినాలి. 75 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో ఉడికించాలి.
- ముడి మాంసం, సగం ఉడికించిన గుడ్లు తినరాదు.
- కోడిగుడ్లు, చికెన్‌ను తాకితే చేతులు బాగా కడుక్కోవాలి.
- ముడి మాంసం, చికెన్, గుడ్లను వేర్వేరుగా నిల్వ చేయాలి. ఇతర ఆహార పదార్థాలతో కలపకూడదు.
- ముడి చికెన్ లేదా కోడిగుడ్లు తగిలిన ఉపకరణాలను బాగా శుభ్రం చేయాలి.
- కత్తులు, బోర్డులు, ప్లేట్లు వేరుగా ఉంచి వేడి నీటితో కడగాలి.
- మరణించిన కోళ్లను తగిన జాగ్రత్తలు తీసుకుని భూమిలో గొయ్యి తీసి కప్పెట్టాలి.
- రవాణా చేసే డబ్బాలను తరచుగా శుభ్రం చేయాలి.
- బర్డ్‌ఫ్లూ ప్రబలిన ప్రాంతాల నుంచి చికెన్, గుడ్లు రవాణా చేయరాదు.
- కోళ్లు లేదా మాంసం తీసుకు వచ్చిన వెంటనే శుభ్రం చేసుకోవాలి.
- మాంసాన్ని ఉడకబెట్టిన తరువాత కడిగితే మంచిది.
- వేడినీటిలో కడిగి, ఎవరైనా తాకితే వెంటనే చేతులు కడుక్కోవాలి.
- వంట చేసే ముందు కిచెన్‌ను శుభ్రం చేసుకోవాలి.
- బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో కానూరు, సమిశ్రగూడెం, మార్కొండపాడు, పెరవలి, ఉండ్రాజవరం, వేలివెన్ను, సీతానగరం పీహెచ్‌సీల పరిధిలోని 34 గ్రామాల్లో 64 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం. రోగ లక్షణాలున్న వారిని గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం. పౌల్ట్రీ కార్మికులకు, చికెన్ షాపుల నిర్వాహకులకు స్వాబ్ పరీక్షలు చేస్తున్నాం.

సీసీ కెమెరాలతో నేరాలకు కళ్లెం

- 22 ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ సిస్టం
- గంజాయిని అరికట్టేందుకు ఈగల్ టీములు
- ఎస్పీ నరసింహ కిశోర్



ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలకు కళ్లెం పడుతుందని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే 2,700 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ప్రజల భాగస్వామ్యంతో మరిన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని, 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లా ముఖ ద్వారాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో గుర్తించిన 22 ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ సిస్టం ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటితో పాటు 7 స్పెషల్ పార్టీలు ఏర్పాటు చేసి సమస్యాత్మక ప్రాంతాల్లో తరచూ కార్డన్ సెర్చ్ చేస్తామని చెప్పారు. నేరస్తులను ముందుగా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆధునిక సీసీటీఎన్ఎస్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ప్రజలు అవగాహన పెంచుకుని, అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలను అరికట్టవచ్చని ఎస్పీ చెప్పారు. పోలీసుల పేరుతో సైబర్ నేరగాళ్లు వీడియో కాల్ చేసి, డిజిటల్ అరెస్ట్ పేరిట భయభ్రాంతులకు గురి చేసి, వారి ఖాతాల నుంచి నగదు దోచుకుంటున్న ఘటనలున్నాయని, డిజిటల్ అరెస్ట్ అనేదే లేదన్న విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. గంజాయిని సంపూర్ణంగా అరికట్టేందుకు ఈగల్ టీములు ఏర్పాటు చేశామని ఎస్పీ నరసింహ కిశోర్ తెలిపారు. ప్రతి సబ్ డివిజన్‌కు ఒకటి చొప్పున జిల్లాలో 5 ఈగల్ టీమ్ వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. కళాశాలల స్థాయిలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఈగల్ టీమ్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎవరైనా విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైతే గుర్తించి, కౌన్సెలింగ్, అవసరమైన వైద్య సహాయం చేస్తారని, డ్రగ్స్ సరఫరా చేసే వారి సమాచారం తెలుసుకుని పోలీసులకు అందిస్తారని తెలిపారు. అనంతరం ఈగల్ టీమ్ వాహనాలను ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు.

క్లుప్తంగా

చోరీకి గురైన మొబైల్ ఫోన్ల అప్పగింత

రాజమహేంద్రవరం సిటీ: దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ద్వారా గుర్తించి వాటిని స్వాధీన పరుచుకుని రూ.1,80,000 విలువైన ఏడు మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసినట్లు రాజమహేంద్రవరం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్టేషన్ ఆవరణలో మొబైల్ ఫోన్లను అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ రూ.5,50,000 విలువైన 47 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోజీఆర్పీ ఎస్ఐ మావుళ్లు, లోవరాజు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం స్వాధీనం

రావులపాలెం: స్థానిక గౌతమి గోదావరి పాత బ్రిడ్జి కింద నీటిలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై చంటి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఐదు అడుగుల 4 అంగుళాల పొడవు, 6 అంగుళాల జుట్టు, నీలిరంగు చీర, శరీరంపై ఉందని, ప్రమాదవశాత్తూ నదిలో పడి కొట్టుకు వచ్చినట్టు భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ శేఖర్‌బాబు కోరారు.

మహీంద్రా నుంచి రెండు మోడల్స్‌లో ఈవీ కార్లు మార్కెట్‌లోకి



బీఈ6 ఈవీకారును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, డాక్టర్ భాస్కరరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని మహీంద్ర ఆథరైజ్డ్ డీలర్ ఎంఅండ్ఎస్ మోటార్స్ షోరూమ్ మంగళవారం సాయంత్రం రెండు రకాల మోడల్స్‌తో బిఈ6, ఎక్స్‌ఈవి9ఈ ఈవీకార్లు మార్కెట్‌లోకి విడుదల చేసింది. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు చేతులమీదుగా కార్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. బీఈ6 ప్రారంభ ధర రూ.27.40 లక్షలు, ఎక్స్‌ఈవి9ఈ ప్రారంభ ధర రూ.31.20లక్షలు ఉందని సంస్థ సీఈవో శ్రీరామ్ తెలిపారు. గ్లోబల్ డిజైన్‌లతో అత్యాధునిక ఫీచర్లతో ఆటో పార్కింగ్, అడాస్ లెవెల్ 2++,360 డిగ్రీస్ సెక్యూర్ పార్కింగ్, 110 సెంమీ సినిమా స్కోప్ స్క్రీన్, విజన్ ఎక్స్, ఐ ఐడెంటిటీ (సేఫ్టీ ఫీచర్) వంటి అత్యాధునిక సదుపాయాలతో మార్కెట్‌లో కారు లభిస్తుందని సీఈవో శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ రాధాకృష్ణ, సేల్స్ మేనేజర్ రంగభాష్యం, ఖాతాదారులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

అలరించిన చోర సంవాదం

- రాజాధిరాజ, అశ్వవాహనాలపై గ్రామోత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థ మహోత్సవాల్లో ఎనిమిదవ రోజు మంగళవారం సాయంత్రం 4 గంటలకు రాజాధిరాజ వాహనంపైన, రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపైన గ్రామోత్సవాలు అర్చకులు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు 16 స్తంభాల మండపం వద్ద అర్చకులు నిర్వహించిన చోర సంవాదం ఘట్టం భక్తులను ఎంతగానో అలరించింది. దారి దోపిడీ దొంగగా మారిన పరకాలుడును, లక్ష్మీనృసింహ స్వామి తిరుమంగయాళ్వార్‌గా మార్చి, మంచి జీవితాన్ని ప్రసాదించిన ఘట్టాన్ని ఇతి వృత్తంగా చేసుకుని అర్చకులు నిర్వహించేది చోర సంవాదం ఘట్టం. కల్యాణోత్సవాల్లో ఏటా మాదిరే ఎనిమిదవ రోజు మంగళవారం గ్రామంలోని 16 స్తంభాల మండపం వద్ద రాత్రి 8 గంటలకు నిర్వహించిన పై ఘట్టం భక్తులను అలరించింది. ప్రేమించిన యువతిని పెళ్లాడేందుకు తిరుమంగయాళ్వార్(పరకాలుడు)దారి దోపిడీ దొంగగా మారడం, స్వామి సాక్షాత్కరించి అతడిలో పరివర్తన తేవడాన్ని కళ్లకు కట్టిస్తూ సాగేదే చోర సంవాదం ఘట్టం. పూర్వం పరకాలుడనే ధనికుడు ఒక యువతిని పెళ్లి చేసుకోవాలని వెంటపడతాడు. అన్నదానం చేస్తేనే వివాహ మాడతానని ఆమె షరతు విధించడంతో ఆస్తి మొత్తాన్ని అన్నదానానికి వినియోగిస్తాడు. క్రమంగా ఆస్తి అంతా హరించి పోవడంతో చేసేది లేక దారి కాచి ప్రజలను దోపిడీ చేసి, ఆ డబ్బుతో అన్నదానం చేస్తాడు. దొంగ బారి నుంచి రక్షించమన్న ప్రజల ప్రార్థనలతో విష్ణుమూర్తి, రాజు వేషంలో దొంగవద్దకు వచ్చి దోపిడీ చేసిన సొమ్ముతో ఈ అన్నదానం చేస్తే ఫలితం దక్కదని హితబోధ చేస్తారు. అయినా దొంగ స్వామివారిని బెదిరించడంతో వంటిపై నున్న ఆభరణాలను ఇచ్చి, నిజ స్వరూపంతో సాక్షాత్కరిస్తారు. పరకాలుడిని తిరుమంగయాళ్వార్‌గా మార్చి, మంచి జీవితాన్ని స్వామి ప్రసాదిస్తారు.



రాజాధిరాజ వాహనంపై గ్రామోత్సవం

అశ్వవాహనం

మనిషిలో ఉండే జ్ఞానం అశ్వం మాదిరిగా చురుకుగా ఉండాలని సూచించేందుకు స్వామి ఉత్సవాల్లో ఈ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.



అశ్వవాహనంపై గ్రామోత్సవం

రాజాధిరాజ వాహనం

రాజులకే రాజైన లక్ష్మీనరసింహస్వామి భక్తుల కోర్కెలు తీర్చడానికి ఈ వాహనాన్ని అధిరోహించి గ్రామోత్సవానికి వెళతారు.

ఘనంగా గ్రామోత్సవాలు

ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు రాజాధిరాజ వాహనంపైన, అశ్వవాహనంపైన శ్రీస్వామివారి గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయం నుంచి పల్లకీలో స్వామి, అమ్మవార్లను అలంకార మండపానికి అర్చకులు, భక్తులు తోడ్కొని వచ్చారు. అలంకార మండపంలో పూలతో స్వామిని అలంకరించారు. వాహనాల వద్ద ప్రముఖులు, అర్చకులు కొబ్బరికాయలు కొట్టి గ్రామోత్సవాలకు శ్రీకారం చుట్టారు. మాఢ వీధుల్లో వాహనాలపై స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అరటి పండ్లు, కొబ్బరికాయలు సమర్పించుకున్నారు.

అంతర్వేదిలో నేడు

ఉత్సవాల్లో భాగంగా బుధవారం తొమ్మిదవ రోజు మాఘ పౌర్ణమి సందర్భంగా స్వామివారి చక్రవారి అవభృథోత్సవం, సముద్రస్నానం నిర్వహిస్తున్నట్టు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ అన్నారు. ఉదయం 3 నుంచి 6 గంటల వరకూ సుప్రభాతసేవ, శ్రీస్వామివారి తిరువారాధన, బాలభోగం, వార్షిక అభిషేకాలు, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు ఉంటాయన్నారు. ఉదయం 8 గంటలకు గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, రాత్రి ధ్వజ అవరోహణ నిర్వహిస్తామన్నారు.

ఆత్మహత్యను నివారించిన పోలీసులకు ఎస్పీ అభినందన

అమలాపురం టౌన్/అన్నవరం/అయినవిల్లి: సకాలంలో స్పందించి కేవలం 6 నిమిషాల వ్యవధిలో ఆత్మహత్య ప్రయత్నం చేసుకుంటున్న వ్యక్తిని కాపాడిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం మంగళవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. అయినవిల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో చనిపోదామని నిర్ణయించుకుని తన బంధువులకు సెల్ఫీ వీడియో తీసి పంపించడమే కాకుండా ఆ వెంటనే ఆత్మహత్యకు సిద్ధమయ్యాడు. అతని బంధువుల నుంచి సోమవారం రాత్రి 11.21 గంటలకు సమాచారం అందుకున్న పి.గన్నవరం సీఐ భీమరాజు తక్షణమే స్పందించి జిల్లా ఐటీ కోర్ సిబ్బంది జాఫర్‌ను అప్రమత్తం చేశారు. బాధితుని సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా అతడు కాకినాడ జిల్లా అన్నవరంలో ఉన్నట్టు తెలుసుకున్నారు. తక్షణమే ఐటీ కోర్ ఈ సెల్ఫీ వీడియోను అన్నవరం ఎస్సై శ్రీహరికి పంపించారు. ఓ లాడ్జిలో బాధితుడు గది తలుపులు వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నాడు. వెంటనే పోలీసులు ఆ లాడ్జీని గుర్తించి అక్కడకు క్షణాల్లో వెళ్లి తలుపులు పగులగొట్టి అతడిని కాపాడారు. ఈ పరిణామాలన్నీ రాత్రి 11.21 గంటల నుంచి 11.27 గంటల వరకూ కేవలం 6 నిమిషాల వ్యవధిలో జరగడం, పోలీసులు వేగంగా స్పందించి ఆత్మహత్యను నిరోధించడంపై ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికావడం తథ్యం



ముద్రగడ పద్మనాభం, గిరిబాబుతో మాట్లాడుతున్న గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

- కుట్రకోణంపై దర్యాప్తు చేయాలి
- ముద్రగడ కుటుంబానికి సంఘీభావం తెలిపిన రాజమహేంద్రవరం వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: కూటమి ప్రభుత్వం ఇదే తరహాదాడులకు పాల్పడితే ప్రజల ఆగ్రహానికి గురికావడం తథ్యం అని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు హెచ్చరించారు. మంగళవారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే, రుడ మాజీ చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను, వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం వాకింగ్ చేసే సమయాన్ని గుర్తించుకుని ఏదో చేద్దామనే ఉద్దేశంతో దాడి చేశారన్నారు. ఆయనకు అనారోగ్యం కారణంగా ఆ నాలుగు రోజులు వాకింగ్‌కి రాకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డారన్నారు. రాజకీయాల్లో సుదీర్ఘ కాలం ప్రజలకు సేవచేసిన వ్యక్తిపై ఇటువంటి దాడి జరిగితే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టీడీపీ సీపీయర్ నాయకులు ఇప్పటివరకు ఖండించకపోవడం దారుణం అన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఈ దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్, చందన నాగేశ్వర్, తోట రామకృష్ణ, అన్నపూర్ణ రాజు, సర్పంచ్‌లు మట్టాశ్రీనివాస్, మల్లిపూడి వెంకటరావు, నాగమల్లేశ్వరరావు పలువురు మాజీ కార్పొరేటర్లు, ఎంపీపీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ ఇరానీ ముఠా అరెస్టు

- రూ.40 లక్షల విలువగల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహ కిషోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): తూర్పుగోదావరి జిల్లాలో కొద్ది రోజులుగా మహిళల మెడలో బంగారు గొలుసులు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారిని ఇరానీ ముఠా సభ్యులుగా పోలీసులు గుర్తించారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ నరసింహ కిషోర్ వివరాలు తెలిపారు. రెండు నెలల కాలంలో రాజమహేంద్రవరం చుట్టుపక్కల ప్రాంతాల్లో వరుసగా సినీ ఫక్కీలో మహిళల మెడలో గొలుసు దొంగతనాలు జరిగాయి. ఆలయాలకు, వివాహ వేడుకలకు, ఫంక్షన్లకు వెళ్లి వస్తున్న ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని ఈ చోరీలు జరిగాయి. నిందితులు ముఖానికి మాస్క్ లేదా హెల్మెట్ ధరించి బైకుపై వేగంగా వచ్చి మహిళల మెడలో గొలుసులు తెంచుకుపోయేవారు. ఇలా మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఏడు, ప్రకాశంనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో మూడు, రాజానగరం పరిధిలో ఒకటి, టూ టౌన్, కొవ్వూరు పరిధిలో మరో మూడు దొంగతనాలు వరుసగా జరిగాయి. దీంతో మహిళలు నగలు ధరించి రోడ్డుపై వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. జరిగిన నేరాలపై ఆయా పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేశారు. కేసుల దర్యాప్తును ఎస్పీ నరసింహ కిషోర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.



ఇరానీ ముఠా చోరీలను వివరిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

పట్టుబడింది ఇలా..

చైన్ స్నాచర్లను గుర్తించేందుకు మొత్తం నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. నగర శివార్లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లాలో చైన్ స్నాచింగ్ జరిగిన ప్రతిసారి పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరస్తుల కదలికలను గమనించేవారు. గొలుసు దొంగల ముఠా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మారుమూల ప్రాంతాలు కేంద్రాలుగా ఆవాసం ఏర్పరుచుకుని రాజమహేంద్రవరం వచ్చి నేరం చేసి తిరిగి ఆ ప్రాంతాలకు బైకులపై పరారవుతున్నట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాలకు జిల్లా నుంచి పోలీసు బృందాలు వెళ్లి నిందితుల కోసం జల్లెడ పట్టారు. రాజమహేంద్రవరం 3వ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని గామన్ వంతెనపై రెండు ద్విచక్ర వాహనాలపై వెళుతున్న ఒక మహిళతో సహా ఆరుగురు వ్యక్తులను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. వారిలో జహీర్ హుస్సేన్, మహమ్మద్ షర్, ఖాసీంఆలీ, కిస్మత్‌లీ, సోహైల్ అబ్బాస్లీ, మహిళ దిల్రుబా బేగం వీరంతా ఒడిశా రాష్ట్రం నౌపడ జిల్లా, కరియర్ రోడ్డు గ్రామానికి చెందినవారు. వీరితో పాటు అదే ప్రాంతానికి చెందిన హైదర్ ఆలీ, జావెద్ ఆలీలు పరారయ్యారు. వీరంతా ముఠాగా ఏర్పడి గతంలో ఒడిశా రాష్ట్రంలో పలు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో నేరాలు చేసి తప్పించుకుని తిరుగుతున్నారు. నేరాలకు అక్కడ అనువుగా లేకపోవడంతో ఈ దఫా నేరాలకు చేసేందుకు రాజమహేంద్రవరాన్ని ఎంచుకున్నారు. వీరిలో ఇద్దరు బైక్‌పై వచ్చి మహిళ మెడలో గొలుసు దొంగతనం చేసి ముందస్తు ప్రణాళిక ప్రకారం సమీపంలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులకు చోరీ సొత్తు ఇచ్చి పరారవుతారు. మార్గమధ్యంలో పోలీసులకు పట్టుబడినా చోరీ సొత్తు వారి వద్ద లేకపోవడంతో అనుమానం రాదు. ఇలా జిల్లాలో చేసిన 14 చైన్ స్నాచింగ్‌లకు గాను రూ.40 లక్షలు విలువచేసే 50 కాసుల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై చోరీ కేసుతో పాటు పీడీ యాక్టు ప్రయోగిస్తామని ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన మధ్య మండల డీఎస్పీ కె.రమేష్, 3టౌన్, రాజానగరం, కొవ్వూరు, క్రైం ఇన్‌స్పెక్టర్లు వి.అప్పారావు, వీరయ్యగౌడ్, విజయబాబు, బాలసౌరి, రాంబాబు, 3టౌన్ ఎస్సై ఎండి. జుబేర్, ఐటీ కోర్ ఎస్సై అయ్యప్పరెడ్డి, రవీంద్ర, అప్పలరాజు, హెచ్‌సీలు, పీసీలు, ఎం.ప్రసాద్, వెంకటరమణ, బి.విజయకుమార్, సత్యనారాయణ, అబ్బాస్, కరీంలను ఎస్పీ అభినందించారు.

సీఎంఏలో జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్

- మొదటిప్రయత్నంలోనే విజయం



కుమారుడితో ఆనందం పంచుకుంటున్న వాగ్దేవ్ తల్లిదండ్రులు

రాజోలు: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) నిర్వహించిన కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్(సీఎంఏ) ఫైనల్ పరీక్షలో తాటిపాక గ్రామానికి చెందిన లక్కింశెట్టి వాగ్దేవ్ జాతీయ స్థాయిలో 2వ ర్యాంక్ సాధించాడు. మంగళవారం ఐసీఎంఏఐ ఫలితాలను విడుదల చేసింది. ఈ మేరకు వాగ్దేవ్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. అతని తండ్రి లక్కింశెట్టి సోమేశ్వరరావు వ్యాపారి. తల్లి లక్ష్మి గృహిణి. చిన్నతనం నుంచి తండ్రి నిర్వహిస్తున్న వ్యాపారాన్ని గమనించిన వాగ్దేవ్ వ్యాపార రంగంపై ఆసక్తి పెంచుకున్నాడు. దీంతో కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్(సీఎంఏ) కోర్సులో గుంటూరులో శిక్షణ పొందాడు. జాతీయ స్థాయిలో జరిగిన సీఎంఏ ఫైనల్ పరీక్షలో 3,647 మంది ఉత్తీర్ణులు కాగా వాగ్దేవ్ రెండవ స్థానంలో నిలిచాడు. 2023లో నిర్వహించిన సీఎంఏ ఇంటర్ స్థాయి పరీక్షలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమే కారణం
- యువతి కుటుంబ సభ్యుల బెదిరింపులతో మనస్తాపం
- ఆరుగురిపై కేసు నమోదు



కొవ్వూరు మండలం వాడపల్లిలో ఉరి వేసుకుని మృతి చెందిన చిట్రా సూర్య(20) ఫైల్

కొవ్వూరు: వాడపల్లి గ్రామానికి చెందిన చిట్రా సూర్య (20) అనే యువకుడు మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని బలవర్మణానికి పాల్పడ్డాడు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సూర్యకు అదే గ్రామానికి చెందిన యువతితో ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ఈ నెల 9వ తేదీన యువకుడు యువతి చదువుతున్న కొవ్వూరులోని స్కూలుకి వెళ్లాడు. యువతిని పిలువమని అడుగగా ప్రిన్సిపాల్ ఆమె కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. తాము ఎవరినీ పంపలేదని చెప్పడంతో యువతిని కలిసేందుకు పాఠశాల నిర్వాహకులు నిరాకరించారు. యువతి పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ వ్యవహారంపై యువతి కుటుంబ సభ్యులు ఆ యువకుడి ఇంటికి వెళ్లి నిలదీశారు. స్థానిక బ్యాంకులో యువకుడి సోదరుడు పనిచేస్తున్నారు. ఆ యువకుడి బ్యాంకు ఉద్యోగం తీయించి వేస్తామని యువతి తల్లిదండ్రులు హెచ్చరించారు. పైగా సూర్యని చంపుతామని బెదిరించడంతో మనస్థాపం చెంది సోమవారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో పక్క గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు యువకుడి తండ్రి శివ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు యువతి కుటుంబ సభ్యులైన హరి, వరలక్ష్మి, పార్వతీ, లాయర్ నరసింహరాజు, సూర్యచంద్రం, సత్యవతిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. సూర్య ఆ కుటుంబంలో రెండో సంతానం అన్నారు. ఒక అన్న, ఒక తమ్ముడు ఉన్నారని అన్నారు. మృతుడి తండ్రి తాపీ పనిచేస్తాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఆయన తెలిపారు.

వాడి కళ్లు పడితే ఇల్లు గుల్లే!

- ఇంటి నేరాల దొంగ అరెస్టు
- 27 కాసుల బంగారం స్వాధీనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/రాజానగరం : పగటిపూట తాళం వేసి ఉన్న ఇళ్లలోకి చాకచక్యంగా ప్రవేశించి విలువైన వస్తువులు దోచుకు వెళుతున్న పాత నేరస్తుడిని రాజానగరం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ మేరకు మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ నరసింహ కిషోర్ వివరాలు తెలిపారు. కొత్త వెలుగుబంద గ్రామానికి చెందిన ప్రగడ కృష్ణారావు గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీన హాస్పిటల్ పనిమీద కుటుంబంతో కలిసి ఇంటికి తాళం వేసి రాజమహేంద్రవరం వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఉంది. బీరువాలోని 31 కాసుల బంగారు వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. రాజనగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసును జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ పర్యవేక్షణలో దర్యాప్తు చేశారు. పాత నేరస్తుల కదలికలపై ఆరా తీశారు. మొత్తం 30 మంది పాత నేరస్తులను విచారించారు. దొంగతనం జరిగిన ఇంటి సమీపంలోని సీసీ కెమెరాలు జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు పరిశీలించారు. ఘటనా స్థలంలో ఆధారాలను బట్టి అడ్డతీగల మండలం గుంటువానిపాలెంకు చెందిన పాత నేరస్తుడు చిలపసెట్టి సన్యాసిరావును అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. అతని వద్ద నుంచి 27 కాసుల బంగారం స్వాధీనం చేసుకున్నారు. మరో 66 గ్రాముల బంగారం ముత్తూట్ గోల్డ్ పాయింట్ దుకాణంలో తాకట్టు పెట్టడంతో అక్కడి నుంచి రికవరీ చేయవలసి ఉందని సీఐ వీరయ్య గౌడ్ తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన రాజానగరం సీఐ వీరయ్య గౌడ్, ఎస్సై మనోహర్, హెడ్ కానిస్టేబుల్- పి అమ్మిరాజు, పీసీలు ఎం.సత్యనారాయణ, బి.వెంకటరమణలను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.



సీఐ వీరయ్య గౌడ్‌ను అభినందిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్

కనుల పండువగా భీమేశ్వరస్వామి రథోత్సవం



ద్రాక్షారామ వీధుల్లో వైభవంగా శ్రీ భీమేశ్వరస్వామివారి రథోత్సవం. రథంపై ఊరేగుతున్న కల్యాణ మూర్తులు (ఇన్‌సెట్)

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 4వ రోజు మంగళవారం అశేష భక్తజనంతో స్వామివార్ల కల్యాణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామివార్ల కల్యాణమూర్తులను పుష్పాలతో అలంకరించిన రథంపై అధిష్టింపజేశారు. ధూపసేవ అనంతరం రథాంగబలి సమర్పించారు. సుమూహూర్త సమయానికి ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివార్ల కల్యాణమూర్తులతో రథం ఆలయం వద్ద నుంచి సూర్యావీధి గుండా వెలంపాలెం చేరుకుని చంద్రా వీధి మీదుగా ప్రధాన రహదారి పైకి, ఆ తర్వాత యానాం సెంటర్ మీదుగా ఆలయ పూజారులు, అర్చకస్వాములు, వేదపండితులు, అశేష భక్తజనులు వెంట రాగా వేగాయమ్మపేటలోని ఆస్థాన పూజా మండపం వరకు సాగింది. రథంలో ఆసీనులైన కల్యాణమూర్తులను దారి పొడవునా ప్రజలు కనులారా దర్శించుకుని భక్తితో కానుకలు సమర్పించుకున్నారు.

18న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత స్థాయి సంఘాల సభ్యులు, అధికారులు, విధిగా హాజరుకావాలని కోరారు.